# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు ..., వరదల వల్ల నష్టపోయిన వారికి ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆర్థిక సహాయం ప్రకటించారు.
2. తెలంగాణా రాష్ట్రంలో ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.
3. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు మంత్రి వర్గ సమావేశం జరుగుతుంది.
4. పిల్లల భవిష్యత్ కోసం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు ఎన్.పి.ఎస్. వాత్సల్య పథకాన్ని ప్రారంభిస్తారు.
5. హైదరాబాదు నగరంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం కన్నులపండువగా జరుగుతోంది.
6. ఈరోజు ప్రపంచ వెదురు చెట్ల అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

==========================

ఆంధ్ర ప్రదేశ్ లో విజయవాడ నగరంతో సహా వరదల వల్ల నష్టపోయిన వారికి ముఖ్యమంత్రి ఎన్. చంద్ర బాబు నాయుడు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఇళ్ళు కోల్పోయిన వారికి ఇళ్ళు నిర్మించి ఇస్తామని, నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తామని విజయవాడలో ముఖ్యమంత్రి నిన్న పాత్రికేయులకు వివరిస్తూ..

.....వాయిస్.... 58 సెకన్లు....

--------------------------

తెలంగాణా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉండేలా అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాదులో నిన్న జరిగిన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... గత పదేళ్ళలో చిన్నా భిన్నమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరైన మార్గంలో పయనింపజేయడానికి శ్రమిస్తున్నామని చెప్పారు. వచ్చే డిసెంబర్‌లో తెలంగాణా తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదు నగరంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చెరువుల ఆక్రమణల తొలగింపు కార్యక్రమానికి అందరూ సహకరించాలని, ప్రకృతి పరిరక్షణే ఈ కార్యక్రమం చేపట్టడంలోని ప్రధాన ఉద్దేశ్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో ఈరోజు మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి వర్గ సమావేశం చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నది. వచ్చే నెల ఒకటవ తేదీ నుండి రాష్ట్రంలో అమలు కానున్న నూతన ఎక్సైజ్ విధానం..... వరద బాధితులకు సహాయ చర్యలు ...., వంద రోజుల పాలన తదితర అంశాలు మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావనకు రానున్నట్టు సమాచారం.

---------------------------

పిల్లలలో పొదుపు ...., ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బడ్జెట్‌లో ప్రకటించిన నేషనల్ పెన్షన్ స్కీమ్.... ఎన్.పి.ఎస్. .... వాత్సల్య పథకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు కొత్త డిల్లీలో ప్రారంభిస్తారు. ఈ పథకం కింద పిల్లలు పసివారుగా ఉన్నపుడు వారి పేరుతో తల్లిదండ్రులు .... లేదా .... వారి సంరక్షకులు ఎన్.పి.ఎస్. వాత్సల్య ఖాతాలను ప్రారంభించవచ్చు. ఆ పిల్లలు 18 సంవత్సరాలు నిండిన తరువాత తరువాత ఈ ఎన్.పి.ఎస్ ఖాతాలు రెగ్యులర్ ఖాతాలుగా మారతాయి. భారత పౌరులతో పాటు ఎన్.ఆర్.ఐ. లు ...., ఓవర్ సీస్ సిటిజన్స్ కూడా ఈ ఖాతాలను ప్రారంభించవచ్చు. ఈ పథకం కింద ఏడాదికి కనీసం వెయ్యి రూపాయల వరకు జమ చేయవచ్చు. జమ చేయడానికి గరిష్ట పరిమితి లేదు. ఈ పొదుపు ద్వారా తల్లిదండ్రులు ఆదాయ పన్ను నుండి మినహాయింపు పొందవచ్చు..

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో రహదారులను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దాలని ఆ శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. వివిధ శాఖలలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు అంశంపై వెలగపూడి సచివాలయంలో ఆయా శాఖల కార్యదర్శులతో సమీక్ష జరిపారు. రహదారుల అభివృద్ధి కోసం ఇప్పటికే నిధులు మంజూరు అయినందున ఈ దిశగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను అవసరమైతే డ్రోన్‌ల ద్వారా గుర్తించి వాటికి మరమ్మత్తులు చేయాలని కూడా నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

---------------------------

హైదరాబాదు నగర వ్యాప్తంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరుగుతోంది. ఖైరతాబాద్ గణేష్ విగ్రహ నిమజ్జనా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్ ఎన్.టి.ఆర్. మార్గ్ వద్ద నుండి నిమజ్జన కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు.

గణేశ నిమజ్జన కార్యక్రమం ఈ రోజు ఉదయానికి పూర్తయ్యే అవకాశం వుందని అధికారులు భావిస్తున్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరుగుతోందని, గత ఏడాది మాదిరిగా ఆలస్యం కాకుండా సాధ్యమైనంత త్వరగా ఈ కార్యక్రమం జరిగేలా చర్యలు తీసుకున్నామని పోలీసు కమిషనర్ సి. వి. ఆనంద్ పాత్రికేయులకు తెలిపారు. వేలాది మంది పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా మండప నిర్వాహకులతో కూడా చర్చలు జరిపామని పోలీసు కమిషనర్ వివరించారు.

---------------------------

ఇలాఉండగా ... గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో నిర్వహిస్తున్నాయని, ఈ రోజు పనిదినం కావడంతో నిమజ్జన కార్యక్రమం ఆలస్యం కాకుండా చూస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

మరొక వైపు ... హైదరాబాదు వ్యాప్తంగా అన్ని వైపుల నుండి గణేష్ విగ్రహాలు తరలి వస్తుండడంతో ట్యాంక్ బండ్ పై జన సందోహం నెలకొంది.

---------------------------

పర్యావరణ సమతూకాన్ని కాపాడడంతో పాటు కోట్లాది మంది ప్రజలకు జీవనోపాధి కల్పించే వెదురు చెట్ల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈ రోజు ప్రపంచ వెదురు దినోత్సవం నిర్వహిస్తున్నారు. 2009 వ సంవత్సరంలో బ్యాంకాక్ లో జరిగిన ప్రపంచ బాంబూ కాంగ్రెస్‌లో అంతర్జాతీయ వెదురు పెంపక పరిరక్షణా సంస్థ చేసిన తీర్మానం మేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 18 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

ప్రపంచ వ్యాప్తంగా అటవీ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వెదురు చెట్లు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటున్నాయి. అంతే కాకుండా గిరిజనుల జీవనోపాధికి వెదురు ఎంతగానో ఉపయోగపడుతోంది. వెదురుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వెదురు చెట్ల పెంపకానికి రాయితీ కూడా సమకూరుస్తోంది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో నీరు –చెట్టు కార్యక్రమం కింద అందజేయవలసి ఉన్న నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎన్. చంద్ర బాబునాయుడు ఆదేశించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ..., జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతో ముఖ్యమంత్రి ఈ అంశంపై నిన్న చర్చలు జరిపి దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. తొలి విడతగా 259 కోట్ల రూపాయల మేర నిధులు విడుదల చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

---------------------------

తెలంగాణా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు త్వరలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. కరీంనగర్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ..... కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని గ్రామాలకు ఫైబర్ నెట్ వర్క్‌ను అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. ఫైబర్ నెట్ వర్క్ పైలట్ ప్రాజెక్టు కోసం సంగారెడ్డి జిల్లా సంగుపేట, నారాయణ పేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామాలను ఎంపిక చేశామని, ఈ గ్రామాలకు పూర్తి స్థాయి నెట్ వర్క్‌ను విస్తరిస్తామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

---------------------------

“శాశ్వత భూ హక్కు – భూ రక్షణ” పేరుతో అమలు చేస్తున్న పథకం పేరును ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం .... “ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు” గా మార్పు చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవిన్యూ శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాలలో భూ వివాదాలు ...., తగాదాలు లేకుండా పరిష్కరించడమే ఈ పథకం ముఖ్యోద్దేశం.

=====================